సాక్షి
యాదాద్రి భువనగిరి
శనివారం । 22 । ఏప్రిల్ । 2023



రైతుల ఆగ్రహం
నల్లగొండ జిల్లా పెద్దవూరలోని సబ్ మార్కెట్ యార్డు ఎదుట జడ్చర్ల– కోదాడ హైవేపై రైతులు ధర్నా చేశారు. - IIలో




20 ఏళ్ల జైలు శిక్ష
మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తికి కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధించింది. - IIలో

గరిష్టం/కనిష్టం
38° / 25°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మంత్రి జగదీశ్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు



సూర్యాపేట: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి అల్లాహ్ కరుణ చూపాలని కోరుకుంటున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యావత్ రాష్ట్ర ముస్లిం మైనా రిటీ ప్రజలకు మంత్రి జగదీశ్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజులుగా సాగుతున్న ముస్లింల ఉపవాస దీక్షల ఆరాధన ఫలించే రోజే రంజాన్ పర్వదినమని పేర్కొన్నారు.

టెక్నికల్ టీచర్స్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరి : టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సుకు గాను 42 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1నుంచి జూన్ 11వ తేదీ వరకు తరగతులు కొనసాగుతాయన్నారు. ఈనెల 20వ తేదీ నాటికి 18 నుంచి 45 ఏళ్ల వయస్సు మధ్య ఉన్న వారు అర్హులన్నారు. పదవ తరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన వారు, లోయర్ గ్రేడ్ టెక్నికల్ సర్టిఫికెట్ పొందిన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవ



సేవోత్సవం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శుక్రవారం ఊంజలి సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆండాల్ అమ్మవారిని వజ్ర వైఢ్యూరాలు, రంగు రంగుల పూలతో అలంకరించారు. అనంతరం ఆలయ మాఢ, తిరువీధిలో సేవోత్సవం, అద్దాల మండపంలో ఊంజలి సేవ నిర్వహించారు. ఇక శ్రీస్వామి వారికి సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అర్చనలు, అభిషేకం, నిత్యకల్యాణం తదితర కైంకర్యాలు చేపట్టారు. వివిధ పూజల ద్వారా నిత్య దాయం రూ.15,18,847 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన

ఆలేరురూరల్ : మండలంలోని శారాజీపేటలో శుక్రవారం తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) ఆధ్వర్యంలో నూతన ఆవిష్కరణలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాష్ట్ర పరిధిలో ప్రభుత్వ పరంగా సరికొత్త ఆలోచనలతో రూపొందిస్తున్న సృజనాత్మక చైతన్య కార్యక్రమాల గురించి ఆ సంస్థ ప్రతినిధులు ప్రణయ్‌కుమార్, వర్షారెడ్డి, ఆదర్శమహేంద్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండ పద్మపర్వతాలు, ఎంపీడీఓ జ్ఞానప్రకాష్, ఎంపీఓ సలీమ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రవీందర్‌రెడ్డి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గజ్జెల రవీందర్‌రెడ్డి

భువనగిరిటౌన్ : జిల్లా(పోక్సో కోర్టు) స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా భువనగిరికి చెందిన గజ్జెల రవీందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కనుల పండువగా గాయత్రీ హవనం

యాదగిరిగుట్ట : పట్టణంలోని శుభోదయ గార్డెన్స్‌లో అఖండ నామ ఆశ్రమ పీఠాధిపతి ప్రసన్న కృష్ణదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో చేపట్టిన అక్షయ సువర్ణ లక్ష్మీ నారాయణ మహాయజ్ఞం వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం భరణి నక్షత్రాన్ని పురస్కరించుకొని దీర్ఘాయుష్షు, ఆరోగ్య సిద్ధి, మృత్యు భయ నివారణ, మనో బలసిద్ధి, విజయ ప్రాప్తికోసం యమ గాయత్రీ హవనం చేపట్టారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు హవనం నిర్వహించారు.

పరిహారం ఎప్పుడిస్తారు?

నీటి పారుదల, రెవెన్యూ శాఖలను ప్రశ్నించిన హైకోర్టు



తొలిదశ పనులు పూర్తి కావొచ్చిన బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం

కోర్టును ఆశ్రయించిన రియల్టర్లు

నిర్వాసితులకు పరిహారం కోసం రూ.45 కోట్లు ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. అయితే ఆ డబ్బును ముందుగా ప్లాట్లు కోల్పోతున్న తమకే ఇప్పించాలని రియల్ ఎస్టేట్ వెంచర్ బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో విచారణ చేపట్టిన హైకోర్టు.. ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న అందరికీ పరిహారం ఇవ్వకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించింది. లాండ్ లూజర్స్ అందరికీ ఏ తేదీలోగా పరిహారం ఇస్తారో చెప్పాలని ఆదేశించింది.

- ఏళ్ల తరబడి చెల్లించకుండా జాప్యం చేస్తున్నారంటూ ఆగ్రహం
- ఎప్పటిలోగా ఇస్తారో స్పష్టంగా తెలియజేయాలన్న న్యాయస్థానం
- సోమవారం కోర్టుకు హాజరుకావాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు
- నివేదికలు సిద్ధం చేస్తున్న యంత్రాంగం



పరిహారం కోసం ఆందోళన చేస్తున్న బీఎన్ తిమ్మాపూర్ గ్రామస్తులు (ఫైల్)

సాక్షి, యాదాద్రి : నృసింహసాగర్(బస్వాపూర్) రిజర్వాయర్ భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో ఏళ్లుగా జరుగుతున్న జాప్యంపై హైకోర్టు సీరియస్ అయ్యింది. అవార్డు ఎంక్వైరీ పూర్తి చేసిన గ్రామాల్లో నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారం విషయంలో నీటి పారుదల, రెవెన్యూ శాఖల పని తీరును తప్పుపట్టింది. ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన రూ.45 కోట్లు తమకే కేటాయించాలని ఓ రియల్‌ఎస్టేట్ వెంచర్ బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం సోమవారం రెండు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు హాజరుకావాలని ఆదేశించింది.

నివేదికల తయారీలో అధికారులు నిమగ్నం

ప్రాజెక్టులో నిర్వాసితులు కోల్పోతున్న భూమి ఎన్ని ఎకరాలకు అవార్డు పాస్ చేశారు.. పరిహారం ఎంత మందికి ఇచ్చారు. ఇంకా ఎంత మందికి ఎన్ని రూ.కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఎప్పటిలోగా అందరికీ పూర్తిస్థాయిలో పరిహారం చెల్లిస్తారో స్పష్టంగా చెప్పాలని హైకోర్టు ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు స్వయంగా కోర్టుకు హాజరై కావాలని సూచించింది. దీంతో ఆయా శాఖల అధికారులు కోర్టు అడిగిన ప్రశ్నలకు లెక్కలు తీసే పనిలో పడ్డారు. భూసేకరణ ప్రక్రియను రెవెన్యూ యంత్రాంగం పూర్తి చేస్తుండగా, ప్రాజెక్టు పనులు చేపట్టిన నీటిపారుదల శాఖ పరిహారం చెల్లించాల్సి ఉంది.

భూ సేకరణకు నాలుగుసార్లు నోటిఫికేషన్

2018 నుంచి భూసేకరణ ప్రక్రియ సాగుతున్నా ఇంతవరకు పూర్తిగా పరిహారం ఇవ్వకపోవడంపై కోర్టు తప్పుపట్టింది. 2022 వరకు నాలుగు గ్రామాల పరిధిలో భూసేకరణకు నాలుగు సార్లు నోటిఫికేషన్ జారీ చేశారు. నిర్వాసితులకు పరిహారం చెల్లించకుండా ప్రాజెక్టు పనులు చేపట్టడాన్ని కోర్టు తప్పుపట్టింది. పరిహారం చెల్లించాలని లేనిపక్షంలో అవార్డు రద్దు చేసి కొత్త భూసేకరణ ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంటుందని ఆదేశించి నట్లు సమాచారం.

నష్టపోతున్న గ్రామాలు ఇవీ..

కాళేశ్వరం ప్రాజెక్టు –16 ప్యాకేజీలో 11.39 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం బస్వాపూర్, బీఎన్ తిమ్మాపూర్, రుస్తాపూర్, వడపర్తి, జంగంపల్లి గ్రామాల్లో భూ సేకరణ కోసం అవార్డు ఎంక్వయిరీ చేశారు. ప్రాజెక్టులో బీఎన్‌తిమ్మాపూర్, లక్ష్మీనాయకు నితండా, చోక్లానాయకుని తండాలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయి.

చెల్లించాల్సిన పరిహారం.. రూ.267 కోట్లు

నృసింహసాగర్ రిజర్వాయర్ ముంపు బాధితులకు మొత్తం రూ.267 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. బస్వాపూర్, బీఎన్ తిమ్మాపూర్, రుస్తాపూర్, వడపర్తి, జంగంపల్లి గ్రామాల్లో ప్రాజెక్టు భూ సేకరణ కోసం ప్రస్తుతం రుస్తాపూర్ మినహా 1,316 ఎకరాల అవార్డు ఎంక్వయిరీ పూర్తయ్యింది. రైతులు, ప్లాట్ల యజమానులు సుమారు 7 వేల మంది పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రాజెక్టు ముంపు గ్రామాలైన బీఎన్‌తిమ్మాపూర్, లప్పానాయక్ తండా, చోక్లానాయకునితండాలకు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీలు ఇవ్వాల్సి ఉంది. పరిహారం కోసం లప్పానాయక్ తండా నిర్వాసితులు నృసింహసాగర్ కట్టపై టెంట్ వేసి 35 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. గతంలో బీఎన్ తిమ్మాపూర్ నిర్వాసితులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే.



బస్వాపూర్ రిజర్వాయర్ కట్టపై దీక్ష చేస్తున్న లప్పానాయక్ తండావాసులు

- నేడే ఈద్–ఉల్–ఫితర్



రంజాన్ ప్రార్థనలకు భువనగిరిలోని ఈద్గాను సిద్ధం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

గర్భిణులు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

- కలెక్టర్ పమేలా సత్పతి



శుక్రవారం సభలో మాట్లాడుతున్న కలెక్టర్

చౌటుప్పల్ : గర్భిణులు మొదటి నెల నుంచే సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్య విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉండరాదని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం మహాసభ, గ్రాడ్యుయేషన్ డేలో ఆమె పాల్గొన్నారు. గర్భవతి అయిన విషయం తెలియగానే అంగన్‌వాడీ కేంద్రంలో, ఆశ కార్యకర్త వద్ద పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. రెండు టీటీ ఇంజక్షన్లు తీసుకోవాలన్నారు. బిడ్డ ఎదుగుదలను తెలుసుకునేందుకు భువనగిరి ఏరియా ఆస్పత్రిలో టిఫా స్కానింగ్ చేయించుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా చిన్నారులకు ఆటపాటలు నిర్వహించారు. ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ మందడి ఉపేందర్‌రెడ్డి, ఎంపీటీసీ జెల్ల ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వైద్యురాలు స్వప్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, ఏఎన్ఎంలు శ్రీదేవి, మంగ, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో రూర్బన్ పథకం కింద మంజూరైన వీవర్స్ క్లస్టర్‌ను కలెక్టర్ సందర్శించారు. మార్కెటింగ్ మెళకువలపై శిక్షణ పొందుతున్న మహిళలు, యువతులతో మాట్లాడారు.

ఎల్లంబావి నర్సరీలో మొక్కల పరిశీలన

ఎల్లంబావిలో నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. ఆమెవెంట డీఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి, ఏపీడీ నాగిరెడ్డి, సర్పంచ్ కొండయ్య, ఎంపీటీసీ ఈశ్వరమ్మ ఉన్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

భువనగిరి : సమష్టి కృషితో మలేరియాను నివారిద్దామని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 25న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యారోగ్య, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో గ్రామాలు, పట్టణాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం డ్రై డేగా నిర్వహించాలని సూచించారు. అనంతరం మలేరియా నివారణ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో ఈదురు గాలులు, వర్షం



చౌటుప్పల్ మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యంలో నిలిచిన వర్షపు నీరు

- వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం
- నేలకొరిగిన వరి చేలు



వర్షానికి కొట్టుకుపోయిన వడ్లను దగ్గరకు చేర్చుతున్న రైతు

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణంతో పాటు మండల పరిధిలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షానికి చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం తడిసింది. చాలా మంది రైతులు రోజువారీ మాదిరిగా ధాన్యం ఆరబోసి సాయంత్రం కుప్పలు పోసుకోకుండానే ఇళ్లకు వెళ్లారు. ఈ సమయంలో అకస్మాత్తుగా వర్షం రావడంతో కొంతమంది రైతుల ధాన్యం తడిసి ముద్దయ్యింది. అందుబాటులో ఉన్న రైతులు, మార్కెట్ సిబ్బంది వెంటనే టార్పాలిన్‌లు కప్పారు. అయినప్పటికీ ధాన్యం రాశుల కిందికి నీరు చేరింది. మరికొన్ని గ్రామాల్లోనూ ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం రాశుల కిందికి నీరు వెళ్లినట్లు రైతులు తెలిపారు. కోతకు వచ్చిన వరి పైరు నేలవాలింది. ఇదిలా ఉండగా వర్షం కురుస్తున్న సమయంలో భారీ శబ్దంతో ఉరుములు, మెరుపులు రావడంతో ప్రజలు భయాందోళన చెందారు.

భువనగిరి : జిల్లాలోని పలు మండలాల్లో వాతావరణం మబ్బులు పట్టి ఉరుములు, మెరుపులు సంభవించాయి. వరి చేలు కోతకు వచ్చిన తరుణంలో వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి



నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేస్తున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : రంజాన్ మత సామరస్యానికి ప్రతీక అని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకొని శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలో ముస్లింలకు తన సొంత ఖర్చులతో నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్‌ను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. అలాగే పిలాయిపల్లిలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు పాక మల్లేశ్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ మోటె రజిత రాజు, గునిగంటి రమేశ్, బందారు ప్రకాశ్‌రెడ్డి, రాఘవరెడ్డి, పిలాయిపల్లి ఉపసర్పంచ్ పడాల సతీష్‌చారి, తోట శ్రీనివాస్, బీరెడ్డి సందీప్‌రెడ్డి, సాబేర్‌ఖాన్, సుల్తానా, సాధక్, ఏజాస్, కీర్తి సంజీవ, కన్నెమోని శంకర్, రావుల అనిల్, జంగయ్య, రాంరెడ్డి, మహేశ్, బాబు, జోగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి నియోజకవర్గానికి రూ.45 కోట్లు

- మంజూరు చేసిన సీఎం కేసీఆర్
- అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు వినియోగం
- నిధుల ఖర్చుకు పాలనాపరమైన అనుమతి



ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి జీఓ కాపీ అందజేస్తున్న సీఎం కేసీఆర్

సాక్షి, యాదాద్రి : భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి నిధుల వరద పారుతోంది. అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే ప్రభుత్వం, హెచ్ఎండీ నుంచి పెద్ద ఎత్తున నిధులు రాగా తాజాగా మరో రూ.45కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన సీఎం.. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) కింద నిధులు విడుదల చేశారు. నిధులను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వీటికి ఖర్చు చేయనున్నారు..

రూ.45 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయాలని ప్రభుత్వం నుంచి కలెక్టర్‌కు ఆదేశాయి అందాయి. జీఓ నంబర్ 162 ప్రకారం నిధుల వినియోగానికి పాలనా ఆమోదం తెలిపారు. ఈ నిధులతో మున్సిపాలిటీలు, మండలాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కమ్యూనిటీ భవనాలు, స్టేడియాలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, విద్యుత్ లైన్ షిఫ్టింగ్‌తో పాటు అసంపూర్తి పనులకు ఖర్చు చేయనున్నారు. ప్రధానంగా భువనగిరిలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు వెడల్పు పనులు, జూనియర్ కళాశాల మైదానంలో క్రీడా మైదానం, మున్సిపాలిటీల పరిధిలో మౌలిక సదుపాయాలకు వినియోగించనున్నారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ, జనరల్ ప్రాంతాల్లోనూ ఖర్చు చేస్తారు. కాగా ఇప్పటికే భువనగిరి మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం టీఎస్ఐఎఫ్‌యూడీసీ నిధులు రూ.17.50 కోట్లు, హెచ్ఎండీఏ నిధులు రూ.6కోట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా భువనగిరిలో ప్రజలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న అర్బన్ కాలనీ రోడ్డు సమస్య తీరనుంది.

పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తాం

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కావాలని అడిగిన వెంటనే రూ.45 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అలాగే ముఖ్యమంత్రికి, నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్య, మార్కెట్ కమిటీచైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీకిరణ్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

అప్రమత్తంగా ఉండాలి

గుండాల : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను డీసీపీ రాజేష్‌చంద్ర శుక్రవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో కలియదిరిగి పరిశీలించారు. పోలీసులకు సలహాలు, సూచనలు చేశారు. క్రైమ్ రేట్ తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. వేసవిలో ప్రజలు ఆరుబయట నిద్రిస్తుంటారని, ఈ సమయంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఏ సమస్య వచ్చినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోలీసు క్వార్టర్స్‌లో మౌలిక సదుపాయాలపై పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట యాదగిరిగుట్ట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ యాకన్న, హెడ్ కానిస్టేబుల్స్ రవికుమార్, ప్రకాష్, గురువయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



గుండాల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ఆలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

ఆలేరు రూరల్ : ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆలేరులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలు దేశంలో మరెక్కడా లేవన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా ఉండాలన్న ఉద్దేశంతో స్థానికంగానే ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ ఎదపాక నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ మల్లేశ్‌గౌడ్, గుండ్లగూడెం సర్పంచ్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


అంజయ్య (ఫైల్)

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం కీతవారిగూడెంలో వాకింగ్ చేస్తుండగా ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన కీత అంజయ్య(46) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ కొండల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కీతవారిగూడెం గ్రామానికి చెందిన కీత అంజయ్య ఈనెల 17న గ్రామ శివారులో వాకింగ్ చేస్తుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో అంజయ్యకు తలకు, కుడి కాలుకు బలమైన గాయాలయ్యాయి. 108 వాహనంలో హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. దీంతో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి బంధువు కీత రామనాథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి దుర్మరణం


బాలయ్య (ఫైల్)

మోటకొండూర్: చేపలు పట్టేందుకుగాను తెప్పలో చెరువులోకి వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన మోటకొండూర్ మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దాసరి బాలయ్య(58) గురువారం చెరువులో చేపలు పట్టేందుకు తెప్పలో వెళ్లాడు. ఎండకు ఆయాసం కావటంతో ఒడ్డు చేరుకోగానే కింద పడిపోయాడు. దీంతో ఆయనను ఆలేరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు శుక్రవారం మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుసూదన్ తెలిపారు.

సెలవులొచ్చాయ్..

2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభం కావడంతో హాస్టల్స్‌లో ఉన్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. సెలవులు 25వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సి ఉన్నా.. 21 ఐచ్ఛిక సెలవు, 22న రంజాన్, 23న ఆదివారం ఉండడంతో హాస్టల్స్‌లో ఉన్న విద్యార్థులు మూడు రోజుల ముందుగానే వసతి గృహాలను ఖాళీ చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రిభువనగిరి


తల్లిదండ్రులతో కలిసి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు




భువనగిరి గురుకుల హాస్టల్ నుంచి స్వస్థలాలకు వెళ్తున్న విద్యార్థులు

ధాన్యం కొనకపోవడంతో రైతుల ఆగ్రహం


పెద్దవూరలో రాస్తారోకో చేస్తున్న రైతులు


రైతుల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్న ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి


- పెద్దవూరలోని జడ్చర్ల– కోదాడ హైవేపై రాస్తారోకో

పెద్దవూర: తాలు పేరిట వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని రైతులు శుక్రవారం పెద్దవూర మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డు ఎదుట జడ్చర్ల– కోదాడ జాతీయ రహదారిపై ధర్నా చేశారు. లారీలు తెప్పించటంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పలు గ్రామాల నుంచి ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించక ముందే ఇరవై రోజుల క్రితం వరి ధాన్యాన్ని పెద్దవూర సబ్ మార్కెట్‌లో పోశామని తెలిపారు. ఈ నెల 17న ఎమ్మెల్యే నోముల భగత్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ నెల 20న అధికారులు వచ్చి ధాన్యంలో తేమ శాతం చూశారని, మ్యాచర్ సరిగ్గా వచ్చినప్పటికీ ధాన్యంలో తాలు ఉందని బస్తాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల వద్ద సైతం తాలు చూసే పరికరాలు లేవని, అయినా తాలు ఉందని ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదన్నారు. కొనుగోలు కేంద్రంలో సుమారు 80కి పైగా ధాన్యం రాశులు ఉంటే అందులో 60కి పైగా తాలు ఉందన్న సాకుతో కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. ఖాళీ బస్తాతో పాటు బస్తాకు 40 కిలోలు తూకం వేయాల్సి ఉండగా 41.200 కిలోలు తూకం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకోతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఉన్నతాధికారులు వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చేదాకా రాస్తారోకోను విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి వచ్చి రైతులతో తహసీల్దార్‌తో మాట్లాడించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏరుకొండ నర్సింహ, రైతులు మోహన్‌రెడ్డి, కంచర్ల రేణుక, వడ్డేపల్లి వెంకట్‌రెడ్డి, మంచికంటి అనిత, కంచర్ల సైదిరెడ్డి, మాధవరెడ్డి, అశోక్, లక్ష్మమ్మ, కల్లూరి మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జానారెడ్డి, వెంకట్‌రెడ్డి, రవి, గోవర్ధన్‌రెడ్డి, అలివేలు, జనార్దన్‌రెడ్డి, వెంకటయ్య, లాలయ్య, భార్గవరెడ్డి, చిరంజీవి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్

ఉన్నతాధికారుల ఆదేశానుసారం శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ సురిగి సైదులుగౌడ్ మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రేపటి నుంచి ధాన్యానికి సరిపడా లారీలు వచ్చేలా చూస్తామని, తాలు పట్టే యంత్రాలను తెప్పిస్తామని, ఏరోజుకు ఆరోజు కొనుగోలు చేసి కాంటాలు వేస్తామని తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి సందీప్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

● అకాల వర్షం.. తడిసిన ధాన్యం


శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి నల్లగొండ శివారులోని కంచనపల్లి ఐకేపీ సెంటర్లో కొట్టుకుపోతున్న ధాన్యం


కంచనపల్లి ఐకేపీ సెంటర్‌లో బురదలో ధాన్యం


చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో..

13 కిలోల గంజాయి పట్టివేత


నిందితుడిని పట్టుకున్న పోలీసులు

యాదగిరిగుట్ట రూరల్: 13 కిలోల గంజాయిని తరలిస్తున్న యువకుడిని ఎల్‌బీనగర్ జోన్ ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన హైదరాబాద్– వరంగల్ ప్రధాన జాతీయ రహదారిలో యాదగిరిగుట్ట మండలంలోని బాహుపేట గ్రామ స్టేజీ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం తెనుగువాడ గ్రామానికి చెందిన నెన్నాల మహేష్, భూపాలపల్లి జిల్లా కాటారం గ్రామానికి చెందిన మెట్ట రంజిత్‌లు ఇద్దరూ వరంగల్ నుంచి హైదరాబాద్‌కు గంజాయిని ద్విచక్ర వాహనం మీద తరలిస్తున్నారు. దీంతో పక్కా సమాచారం అందుకున్న ఎస్వోటీ పోలీసులు ఎన్‌హెచ్ 163 ప్రధాన జాతీయ రహదారిలోని యాదగిరిగుట్ట మండలం బాహుపేట గ్రామం స్టేజీ పరిధిలో వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరిలో మెట్ట రంజిత్ పారిపోగా.. నెన్నాల మహేష్ పట్టుబడ్డాడు. దీంతో అతడి బైక్‌ను తనిఖీ చేయగా 13 కిలోల గంజాయి లభించింది. అతడి వద్ద సెల్ ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన యువకుడు ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ అని, సేల్స్ చేసేవాడు పారిపోయాడని ఎస్‌వోటీ పోలీసులు తెలిపారు. నిందితుడిని యాదగిరిగుట్ట పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ రావు తెలిపారు.

మానవ మృగానికి 20 ఏళ్ల జైలు

చివ్వెంల(సూర్యాపేట): మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు మొదటి అదనపు న్యాయమూర్తి ప్రేమలత శుక్రవారం తీర్పు వెల్లడించారు. సూర్యాపేట పట్టణంలోని ఇందిరమ్మ ఆస్పత్రి వద్ద ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లలో ఓ మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి నివాసం ఉంటుంది. ఆమె భర్త 10 సంవత్సరాల క్రితం చనిపోయాడు. ఈమె ప్రతిరోజు కూలి పనికి వెళ్తుంది. ఈ క్రమంలో పని ప్రదేశంలో చివ్వెంల మండలం మున్యానాయక్ తండాకు చెందిన భానోతు శ్రీనుతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆమెను రెండో వివాహం చేసుకున్నాడు. అనంతరం ఆమెతో కలిసి అదే ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఆరో తరగతి వరకు చదివి ఇంట్లో ఉంటూ తల్లితో అప్పుడప్పుడు పనికి వెళ్తున్న ఆమె కూతురిపై శ్రీను కన్ను పడింది. ప్రతిరోజు తల్లి పనికి వెళ్లగానే బాలికను లైంగికంగా వేధించేవాడు. 1–12–2019న ఇంట్లో ఎవరు లేని సమయంలో సాయంత్రం బాలికను ఇంట్లోకి బలవంతంగా తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. తిరిగి మరుసటి రోజు అత్యాచారం చేయబోగా బాలిక కేకలు వేసింది. దీంతో అతను పరారయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లికి జరిగిన విషయాన్ని చెప్పడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ కె.శివశంకర్ నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పలు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ త్యాగరాజన్ వాదనలతో ఏకీభవిస్తూ నిందితునికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. బాలికకు రూ.7 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేశారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్

భూదాన్‌పోచంపల్లి: పీవీసీ ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఆరుగురు ఒడిశా వలస కార్మికులపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిని పోలీసులు రిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని నారాయణగిరి గ్రామ సమీపంలో పీవీసీ ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఆరుగురు ఒడిశా వలస కార్మికులను బుధవారం ఇటుక బట్టీల యజమాని పోక వెంకటకిరణ్, సురేశ్‌లు దాడి చేసి గాయపరిచారు. ఈమేరకు వారిని అరెస్ట్ చేసిన పోలీసులు శుక్రవారం భువనగిరి కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు.

తుర్కపల్లిలో చోరీ

తుర్కపల్లి: వృద్ధురాలి మెడలోని బంగారు గుండ్లు గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఈ సంఘటన తుర్కపల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. గిరి రంగమ్మ తన కుమార్తె ఇంటికి వచ్చి కొన్నిరోజులుగా ఇక్కడే ఉంటుంది. శుక్రవారం గ్రామంలో సంత కావడంతో కుమార్తె సత్తెమ్మ కూరగాయలు అమ్మడానికి సంతకు వెళ్లింది. ఈ క్రమంలో సుమారు 7గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి మంచినీరు అడిగాడు. ఆమె నీరు తెచ్చి ఇవ్వగానే రంగమ్మ మెడలో మెడలో ఉన్న తులంన్నర బంగారు గుండ్లను లాక్కొని వెళ్లాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు.

ఉపాధిహామీ కూలీకి గాయాలు


చికిత్స పొందుతున్న చంద్రారెడ్డి

మద్దిరాల: మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పనిచేసే క్రమంలో కార్మికుడికి గాయాలయ్యాయి. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుపట్ల గ్రామానికి చెందిన బెజ్జంకి చంద్రారెడ్డి రోజు మాదిరిగానే శుక్రవారం ఉపాధి హామీ పనికి వెళ్లాడు. అక్కడ పని చేసే క్రమంలో రోడ్డు దిగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడగా గాయాలు కావడంతో సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. చంద్రారెడ్డి కాలు ప్యాక్చర్ అయినట్లు ఏపీఓ గుండు వెంకన్న తెలిపారు.

మెడిసిన్ నిల్వచేసినందుకు ఇద్దరికి మూడేళ్ల శిక్ష

భువనగిరి: లైసెన్స్ లేకుండా మెడిసిన్‌కు సంబంధించిన మందులు నిల్వ చేసిన నిందితులకు 3 సంవత్సరాలు జైలు శిక్షను విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి దశరథ రామయ్య శుక్రవారం తీర్పు వెల్లడించారు. భువనగిరిలో ఏ ఎట్టిబాబు, ఏ జ్యోతి మెడికల్ షాప్ నిర్వహిస్తున్నారు. అనుమతి లేకుండా పట్టణంలో మనోహర్ నివాసంలో మందులు నిల్వ చేశారు. ఈక్రమంలో 2013లో అప్పటి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోవింద్‌సింగ్, శ్రీకాంత్‌కు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మెడిసిన్ నిల్వ చేయడంతో కేసు నమోదు చేసి కోర్టులో దాఖలు చేశారు. శుక్రవారం కోర్టులో విచారణ సందర్భంగా సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టడంతో నిబంధనలకు విరుద్ధంగా మందులు నిల్వ చేసినట్లు రుజువు కావడంతో ఇద్దరికి 3 సంవత్సరాలు కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20వేలు జరిమానా విధిస్తూ తీర్పు ప్రకటించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 3 నెలలు సాధారణ శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చినట్లు ప్రస్తుత డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విన్‌కుమార్ తెలిపారు.

యుగంధర్‌కు బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న యుగంధర్

వలిగొండ: మండల కేంద్రానికి చెందిన డాక్టర్ పోలేపాక యుగంధర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. వైద్యరంగంలో విశిష్ట సేవలు అందించినందుకుగాను హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మదర్ ఫౌండేషన్, మెగాసిటీ నవకళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ భాను ప్రసాద్ రావు, డాక్టర్ ఆశిష్ చౌహాన్, ప్రముఖ హైకోర్ట్ న్యాయవాది రాపోలు భాస్కర్ నేత, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, డాక్టర్ ఏవీ స్వామి, కంచర్ల ఈశ్వర్ చారి, మల్లికార్జున్ రావు, రాఘవ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

లారీకి తగిలిన విద్యుత్ తీగలు

- కూలిన విద్యుత్ స్తంభాలు

మోత్కూరు: కట్టెల లోడ్‌తో వెళ్తున్న లారీ విద్యుత్ తీగలకు తగలడంతో ట్రాన్స్‌ఫార్మర్, రెండు స్తంభాలు కూలిపోయాయి. ఈ సంఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర దేవాలయానికి ఎదురుగా మెయిన్ రోడ్డు వద్ద గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కాలనీ వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టె లోడ్‌తో హాలియా నుంచి బయలుదేరి మోత్కూరు మీదుగా ఆదిలాబాద్, సిరిపూర్ కాగజ్‌నగర్‌కు వెళ్తుండగా.. మోత్కూరులో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఎదురుగా మెయిన్ రోడ్డులో లారీకి విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్, రెండు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. శుక్రవారం అధికారులు, సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

పిడుగు పడి తాటిచెట్టు దగ్ధం

మునుగోడు: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు కురిసాయి. మునుగోడు గ్రామ శివారులోని కంత మహేశ్వరస్వామి దేవాలయం సమీపంలోని ఓ తాటి చెట్టుపై పిడుగు పడింది. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కాగా.. కురిసిన వర్షంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది.

ముందస్తు ఖరీఫ్ సాగుకు సిద్ధమవ్వండిలా..

- గుర్రంపోడు ఏఓ మాధవరెడ్డి



కంచర్ల మాధవరెడ్డి
వ్యవసాయాధికారి, గుర్రంపోడు

గుర్రంపోడు : వేసవిలో అడపాదడపా కురిసే వర్షాలను వినియోగించుకుని ముందస్తుగా రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనులకు సన్నద్ధమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంటకు అనువైన నల్లరేగడి భూముల్లో వేసవి దుక్కులను రైతులు చేపడుతున్నారు. వేసవి దుక్కులు, భూసార పరీక్షలు, నేల స్వభావాన్ని బట్టి పంటల సాగు ఇతర సాగు విధానాలపై రైతులు మెళకువలు, అవగాహన కల్గి ఉండాలని, వేసవి సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని మండల వ్యవసాయాధికారి కె.మాధవరెడ్డి సూచిస్తున్నారు.


వేసవి దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతులు

లోతు దుక్కులతో మేలు

లోతు దుక్కులు దున్నినప్పుడు భూమిలో ఉండే పురుగులు, తెగుళ్లను నశింపజేసే అవకాశం ఉంటుంది.



భూమిలో దాగి ఉన్న లేదా నిద్రావస్థలో ఉన్న పురుగులు, తెగుళ్లను కలుగ జేసే శిలీంద్రాలకు సూర్యరశ్మి సోకి నశిస్తాయి. దుక్కిలో బయట పడిన గుడ్లు, ప్యూపాలను పక్షులు తిని నాశనం చేస్తాయి. కాబట్టి తొలకరిలో వేసే పైర్లకు వీటి తాకిడి తగ్గడానికి అవకాశం ఉంటుంది. భూమిలో 9 అంగుళాల వరకు లోతు తగ్గకుండా దుక్కులు దున్నుకోవడం శ్రేయస్కరం.

పంట మార్పిడి తప్పనిసరి

భూమిలో ఏటా పంట మార్పిడి చేసుకోవాలి. రైతులు ఒకే రకమైన పంటను వరుసగా సాగు చేస్తూ దిగుబడులు రాక నష్టపోతున్నారు. ఒకే పంటను ఏళ్ల తరబడి పండించడం వల్ల చీడపీడలకు ఎప్పుడూ ఆహారం సమృద్ధిగా లభించి అవి వృద్ధి చెందుతాయి. ఆ పంట వేర్లు వ్యాపించిన మేర భూమి పొరలు నిస్సారమవుతాయి. పంట మార్పిడి నేలసారాన్ని కాపాడుకోవడంతోపాటు తేమను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. వివిధ రకాల వేరు వ్యవస్థలు కలిగి భిన్నంగా పెరిగే పైర్లను పంట మార్పిడి కోసం ఎంపిక చేసుకోవాలి. పత్తి, ఆముదం, పొద్దు తిరుగుడు వంటి పైర్లు నేల లోపలి నుంచి పోషకాలు తీసుకుంటాయి. పోషకాలు ఎక్కువగా తీసుకునే నువ్వులు, పొద్దు తిరుగుడు వంటి పంటలకు భూమికి పోషకాలు సమకూర్చే అవసరాల పైర్లతో పంట మార్పిడి చేసుకోవాలి. ఇవి బెట్ట పరిస్థితులను తట్టుకుంటాయి. వరుసగా పప్పుదాన్యాల పంటలు కాకుండా నూనె పంటలు సాగు చేయాలి. మిరప, టమాట, వేరుశనగ, పంటలను ఆశించే లద్దె పురుగు నివారణకు జొన్న, సజ్జ, రాగి పంటల ఎర పంటలుగా వేసుకోవాలి. టమాట, మిరప, పుచ్చ పంటల్లో బంతిని కూడా వేరే పంటగా కొన్నిసాళ్లు వేసుకుని తెగుళ్లు, ఆకుముడత నివారించవచ్చు.మార్పిడి చేసేటప్పుడు అనుకూలమైన పంటలు ఎంచుకోకపోతే చీడపీడల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. బెండ తర్వాత ప్రత్తి వేయకూడదు.జొన్న సాగు చేసిన వెంటనే మిరప వేయకూడదు. ఈ పంటలకు ఒకే రకమైన చీడపీడలు ఆశించి నష్ట పరుస్తాయి.

లోతు దుక్కులతో కలుపు నిర్మూలన

తుంగ, గరిక వంటి కలుపు మొక్కలు పొలాల్లో పెరిగి పంటలు నాశనం చేస్తాయి. కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి సత్తువ లేకుండా చేస్తాయి. దీనివల్ల భూసారం తగ్గడమే కాకుండా భూమిలోని లోతైన పొరల్లో తేమ తగ్గుతుంది. తుంగ, గరికల వేర్లు దుబ్బుగా ఉండి నేలలో బాగా విస్తరించి ఉండటం వల్ల నివారణ కష్టం అవుతుంది. వేసవిలో దుక్కి బాగా దున్నినప్పుడు ఈ కలుపు వేర్లు , దుంపలు ఏరి వీటిని అరికట్టవచ్చు. వేసవిలో లోతుగా దున్ని తొలకరి వర్షాలకు గొర్రు, గుంటులతో దున్నినప్పుడు నేల బాగా గుల్ల బారుతుంది. పైర్ల వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. నేలకోతకు గురికాకుండా వాలుకు అడ్డంగా దున్నడం, వర్షపు నీటికి ప్రవాహానికి అడ్డంగా చిన్నపాటి మట్టి, రాతి కట్టడాలు ఏర్పాటు చేసుకోవాలి. పత్తి, కంది, ఆముదం కట్టెలను తొలగించి పొలంలోనే కాల్చివేయాలి. పొలంలో గట్టిపార ఏర్పడితే ఎర్రని ఇసుక మట్టిని తోలడం వల్ల భూమి బాగుపడుతుంది. వేసిన పంట నుంచి వేర్లు సులభంగా భూమిలోకి దిగుతాయి. వేసవిలోనే సేంద్రియ ఎరువులు పంట పొలాలకు తరలించుకోవాలి. నీటి లభ్యత ఉన్న రైతులు పెంట కుప్పలపై నీటిని అడపదడపా చిలుకరించడం వల్ల తొందరగా ఎరువుగా మారుతుంది. కుళ్లిన సేంద్రియ ఎరువులు వర్షాధార పంటల్లో త్వరగా బెట్ట పరిస్థితులను కల్గిస్తాయి.

భూసార పరీక్షల ఆధారంగా పంటలు

రైతులు ముఖ్యంగా పండ్లతోటలు సాగ చేసే రైతులు భూసార పరీక్షలు చేయించి పంటలు సాగు చేసుకోవాలి. లేకపోతే ఐదేళ్ల వరకు పెంచి కాపు కొచ్చే దశలోనే క్షీణించి రైతుకు పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉంది. భూసార పరీక్షలు ద్వారా తమ నేల ఏ పంటలకు అనుకూలమో నిర్ధారించుకోవాలి.





సాక్షి క్లాసిఫైడ్స్



■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785870]

■ నల్లగొండ పట్టణం 8th & 6th క్లాస్ స్టూడెంట్స్ కి హోమ్ ట్యూషన్ చెప్పుటకు B.Tech/B.Sc., MPC రన్నింగ్/పూర్తిచేసినవారు లేడీ టీచర్ (EM) కావలెను. సంప్ర।। 9949697829, 8106172422 [Y-784339]

■ నల్లగొండ క్లబ్‌లో బార్ అండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ మరియు బ్యాంకెట్ హాల్‌లో పనిచేయుటకు స్టాఫ్ మరియు సర్వీస్ స్టాఫ్ కావలెను. సంప్ర।। 7780609618, 7013991911 [Y-784340]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 16K–18K, ఏజెంట్ కమిషన్ 6K. ఫోన్:9640528899, [H-793415]

■ పర్మినెంట్ జాబ్స్, ప్రముఖ సంస్థ నందు డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సూపర్‌వైజర్, క్లర్క్స్, ఆఫీస్ బాయ్స్ కావలెను. Qul:: 5 to డిగ్రీ, జీతం: 15000 to 35000 ఫోన్ : 9676504792 [HA-6124]



HOUSE FOR SALE

■ నల్గొండ పట్టణం MLG రోడ్డు అల్కాపురి కాలనీలో సౌత్ ఫేస్ న్యూ కన్‌స్ట్రక్షన్ అన్ని వసతులు గల ఇల్లు అమ్మబడును. బ్యాంకు లోన్ సౌకర్యం కలదు. ఫోన్ : 7396781479, 9440184054 [H-781556]

■ Miryalaguda First Gated Community. 92 Luxury Villas, Club House Swimming Pool, Ready to Occupy Just Rs.1.11Cr. Contact : 7013578378 [H-797576]

FOR SALE

■ JB Infra విజయవాడ హైవే ఫేసింగ్ చౌటుప్పల్‌లో High రిటర్న్స్ DTCP ప్లాట్స్ @ 8500/- to 13,000/- RRR దగ్గరగా, సాగర్ హైవేలో ఇబ్రహీంపట్నంలో HMDA ప్లాట్స్ & విల్లాస్. సంప్ర।। 9491487423 [YA-3120]

FLAT FOR SALE

■ LAUNCHING OFFER: రూ. 3లక్షలకే 18 లక్షల విలువ గల 1050Sft. గల 2BHK Flat సొంతం చేసుకోండి. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి Temple నుండి 2కి.మీ. మాత్రమే. ఫోన్: 9948525151, 6262838353 మార్కెటింగ్ కు ఏజెంట్లు కావలెను. [HA-3176]



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.